నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, ఆదివారం 24 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలో నియోజకవర్గ స్థాయి
- ముఖ్య నాయకులతో సమావేశం
- కష్టపడితే విజయం తథ్యం
- ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, మార్చి23 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం ఆసిఫాబాద్ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పట్టుగొమ్మలని, పల్లెలో ప్రతిరోజూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, ఈ విషయాన్ని ప్రజలందరి దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీని వీడే అవకాశవాదులతో ఎలాంటి నష్టం లేదని, వారిని మళ్లీ పార్టీలోకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే విజయం తథ్యమని స్పష్టం చేశారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని విశ్వసిస్తున్నారని, మనం చేయాల్సిందల్లా ప్రతి ఓటరును కలిసి కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించడమేనన్నారు. కాంగ్రెస్ 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని, ఇప్పటి వరకు ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలు చేసింది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, జడ్పీటీసీలు అజయ్, దుర్పాతాబాయి, ఎంపీపీలు మల్లికార్జున్‌యాదవ్, సౌందర్య, మోతీరాం, నాయకులు మార్సుకోల సరస్వతి, బుర్సు పోచయ్య, గంధం శ్రీనివాస్, ఇంతియాజ్‌లాలా, అబ్దుల్లా, అలీబిన్‌హైమద్, రవి, ఎత్తేశ్యాం, సంజీవ్, హైమద్ పాల్గొన్నారు.

ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించుకుందాం

బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మార్చి 23 : బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించుకుందామని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం అరిగెల నివాసానికి వెళ్లిన ఆత్రం సక్కు తన గెలుపునకు సహకరించాలని కోరారు. అరిగెల మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బలంగా ఉందని, నాయకులు మాత్రమే పార్టీలు మారుతున్నారని, ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సౌమ్యుడైన ఆత్రం సక్కుకే జై కొట్టాలని కోరారు. అనంతరం ఆత్రం సక్కు, అరిగెల ఒకరినొకరు సన్మానించుకున్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, నాయకులు నిసార్, భీమేశ్, ప్రణయ్, బాబురావు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ధర్నా చేసిన మహిళలపై కోడ్ ఉల్లంఘన కేసు

చెన్నూర్ రూరల్, మార్చి 23 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్‌లోగల గుడిసెకాలనీకి చెందిన పలువురు మహిళలపై ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కేసు నమోదైందని చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టగా, ఎఫ్ఎస్‌టీ టీం ఫిర్యాదు మేరకు మద్దెల భదాణి, శిరీష, ప్రసన్న, పద్మ, సుజాత, రుక్మిణి, మౌలిక, ప్రియాంక, రేవతితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేయాలని, ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పంట నష్టం.. రైతన్నకు కష్టం..

కుకుడలో తడిసిన మిర్చి పంటను ఆరబెట్టిన రైతు

- 2,477 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- అకాల వర్షాలతో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలపై ప్రభావం
- నష్టాన్ని అంచనా వేసిన వ్యవసాయ శాఖ అధికారులు
- కాంగ్రెస్ సర్కారు ఇచ్చే రూ.15 వేల పరిహారంపై ఆశలు

మంచిర్యాల, మార్చి 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవల కురిసిన అకాల వర్షం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జొన్న, మొక్కజొన్న, పొగాకు, కంది, నువ్వులు, మిరప, వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చే దశలో ఉన్న జొన్న, మొక్కజొన్న కండ్ల ముందే నేలమట్టమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నేలకొరగడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో తీవ్రమైన నష్టం వాటిల్లింది. నాలుగైదు రోజులపాటు కురిసిన వర్షాలతో ఈ రెండు జిల్లాలో దాదాపు 2,477 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు.

జొన్న రైతులకు నష్టం

- ఆదిలాబాద్ జిల్లాలో జొన్న 1,526 ఎకరాలు, మొక్కజొన్న 434, పొగాకు 26, వరి 11, నువ్వులు 36 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సిరికొండ మండలంలో 11, నేరడిగొండలో 4, బజార్‌హత్నూర్‌లో 5, ఇంద్రవెల్లిలో 5, గుడిహత్నూర్‌లో 7, ఆదిలాబాద్ రూరల్‌లో 5, గాదిగూడలో 4, ఇచ్చోడలో 20, ఇంద్రవెల్లిలో 7, జైనథ్‌లో 5, తలమడుగులో 7 మొత్తంగా 80 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి.
- మంచిర్యాల జిల్లాలో 69 ఎకరాల్లో వరి, 374.2 ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో నువ్వుల పంట దెబ్బతిన్నాయి. దండేపల్లి మండలంలో 13, లక్షెట్టిపేటలో 11, జన్నారంలో 6 ఎకరాల్లో మొత్తం 30 గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. ఉమ్మడి జిల్లాలో 1,900 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతినడంతో సాగు చేసిన రైతులకు అరణ్యరోదనే మిగిలింది. మంచిర్యాల జిల్లాలో వరి నేలకొరిగింది.
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ స్వల్పంగా నష్టం వాటిల్లింది. ముఖ్యంగా చేతికొచ్చిన మిరప నాశనమైంది. బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాల్లో ఆరబెట్టిన మిరప అకాల వర్షాలకు నీట మునిగాయి. దీంతో పంట తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎలాగైన పంట కొనుగోలు చేసిన తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.
- కాగా.. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.15 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. గతంలో ఇదే సమయంలో వచ్చిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు పంట నష్టపోయిన రైతులకు కేసీఆర్ సర్కార్ రూ.10 వేల చొప్పున పరిహారం అందించింది. నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు అప్పుడు సాయం అందింది. కానీ.ఇప్పుడున్న ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి నిలబెట్టుకోలేదు. రైతు భరోసా అందరికీ ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే చేస్తామన్న రుణమాఫీ ఊసే ఎత్తడం లేదు. దీంతో పంటలకు నష్టపరిహారం అందించడం ప్రకటనలకే పరిమితం అవుతుందా? లేక నిజంగానే రైతులకు పరిహారం అందజేస్తారా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాలవారీగా దెబ్బతిన్న పంట, నష్టపోయిన రైతుల వివరాలు..

జిల్లా	దెబ్బతిన్న పంట(ఎకరాలు)	నష్టపోయిన రైతుల సంఖ్య
ఆదిలాబాద్	2,033	1117
మంచిర్యాల	444.2	383

ప్రభుత్వమే ఆదుకోవాలి..

నాకు ముంజంపల్లిలో 5.20 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో ఈ యేడాది మిర్చి వేశా. పంట బాగానే వచ్చింది. కానీ.. గత మంగళవారం రాత్రి సమయంలో వడగండ్ల వాన కురువడంతో కోసి ఎండబెట్టిన మిర్చి తడిసి ముద్దయింది. అదేవిధంగా చెట్టుపై ఉన్న మిర్చి కూడా పూర్తిగా రాలి.. నాణ్యత తగ్గింది. కొనుగోలుదారులు ధర పెట్టడం లేదు. తద్వారా నేను పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో నాకు సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- తుమ్మిడె శంకర్, ముంజంపల్లి, రైతు

కోలుకోలేని దెబ్బ..

ఆరుగాలం కష్టపడి పంట చేతికందే సమయంలో అకాల వర్షం దెబ్బతీసింది. నేను నాకున్న రెండెకరాల్లో మిర్చి వేశా. పెట్టుబడిని పెద్ద మొత్తంలో పెట్టి పంట బాగానే రావడంతో మురిసి పోయా. కానీ.. వడగండ్ల వానతో ఆరబెట్టిన పంట తడిసి రంగు మారి నల్లబడింది. నాణ్యత కోల్పోవడంతో అనుకున్న ధర రాక నిరాశే మిగిలింది. రంగు మారిన మిర్చితో కొనుగోలు చేసే వారు కూడా తక్కువ ధర పెడతామంటున్నారు. నాకు సుమారు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లింది. నష్టంపై ప్రభుత్వం సర్వేలు నిర్వహించాలి. పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నా.

- ఆబిద్ ఖాన్, కుకుడ, రైతు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోశ్

హాజీపూర్, మార్చి 23 : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంచిర్యాల కలెక్టర్ బదాత్ సంతోష్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలం ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను హాజీపూర్ నాయబ్ తహసీల్దార్ హరితతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పూర్తి చేసిన సిలబస్‌ను మరోసారి రివిజన్ చేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. వేసవి కాలం అయినందున ఎవరైనా అస్వస్థతకు గురైనట్లయితే వెంటనే అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

హాజీపూర్ మండలం వేంపల్లి, రాపల్లి – 2, పడ్తన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్.. జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, మంచిర్యాల ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మితో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళల వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ దవాఖానల్లో నమోదు చేయించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. అనంతరం అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా పిల్లలతో అక్షరాలు దిద్దించారు. అన్న ప్రాసన, సీమంతం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పడ్తన్‌పల్లి గ్రామంలోని నర్సరీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, హాజీపూర్ నాయబ్ తహసీల్దార్ హరితతో కలిసి సందర్శించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి అయినందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వడదెబ్బ సంబంధిత మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ కర్త రజిత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, టీచర్లు, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

'పబి' పరీక్ష కేంద్రం..

మంచిర్యాల అర్బన్, మార్చి 23 : జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం పరిసరాలు, సీసీ టీవీ గదిని పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

టీబీజీకేఎస్ అంతం ఎవరితరం కాదు

టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి

మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మార్చి 23: టీబీజీకేఎస్ కార్మికుల హక్కుల సాధన కోసం రెండు దశాబ్దాలుగా పోరాడుతున్నదని, ఆ సంఘాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం నేత నూనె కొమురయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాన్ని పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల కోసం పనిచేయడం లేదని విమర్శించారు. గుర్తింపు సంఘంగా పనిచేసిన 11 ఏళ్ల కాలంలో 75 కార్మిక హక్కులను సాధించామన్నారు. టీబీజీకేఎస్ కేంద్ర అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య రాజీనామాలు చేయగా, వర్కింగ్ కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇక్కడ 11 డివిజన్‌ల నుంచి యూనియన్ నాయకులు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, మేడిపల్లి సంపత్, బడికల సంపత్‌కుమార్, పెట్టం లక్ష్మణ్, రాజశేఖర్, మంగీలాల్, వడ్డెపల్లి శంకర్, జహీద్‌పాషా, పర్లపల్లి రవి, మాదాసి రామమూర్తి, ఐలీ శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సమ్మయ్య, కాపు కృష్ణ, కిరణ్‌కుమార్ మురళి ఉన్నారు.

కొత్త జీవితం ప్రారంభించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆసిఫాబాద్,మార్చి 23 : తెలిసీ తెలియక చేసిన తప్పుల వల్ల జైలు జీవితం అనుభవిస్తున్న వారు, విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో కొత్త జీవితం ప్రారంభించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య సేవలు అందించాలని అధికారులను సూచించారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. బ్రహ్మకుమారి ఆర్తి ఖైదీలకు మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అధికారులు వెంకటేశ్వర్లు, అంజనీ దేవి, జైలు అధికారులు పాల్గొన్నారు.